డంప్‌యార్డు సమస్య పరిష్కరించాలి

- అండాళమ్మ కాలనీవాసుల ధర్నా

డంప్‌యార్డు వద్ద ధర్నా చేస్తున్న అండాళమ్మకాలనీ వాసులు

మంచిర్యాలటౌన్, మార్చి 4 : మంచిర్యాల పట్టణంలోని తొమ్మిదోవార్డు అండాళమ్మకాలనీ సమీపంలోని డంప్‌యార్డు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డంప్‌యార్డు ఎదుట ధర్నాకు దిగారు. చెత్త వేసేందుకు వచ్చిన వాహనాలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్తతో దుర్వాసన, మున్సిపల్ సిబ్బంది చెత్తను తగులబెట్టడం వల్ల తీవ్రమైన పొగ వస్తుందన్నారు. దీంతో అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఆందోళనలు చేసినపుడు ఎమ్మెల్యే, చైర్మన్, కమిషనర్ వచ్చారని, అదనపు కలెక్టర్ దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లామని తెలిపారు. రెండు నెలల్లో డంప్‌యార్డు సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారని, నాలుగు నెలలైనా పరిష్కారం కాలేదన్నారు. ఇక్కడి నుంచి డంప్‌యార్డును వెంటనే వేరేచోటుకి తరలించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు పొగ రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కనక దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

హోమం పూర్ణాహుతి చేస్తున్న రెస్క్యూ రీజియన్ జీఎం గుప్తా దంపతులు

రామకృష్ణాపూర్, మార్చి 4 : రామకృష్ణాపూర్ మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలోని కనక దుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మందమర్రి జీఎం మనోహర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, చండీహోమం చేపట్టారు. బెల్లంపల్లి రీజియన్ గనుల రక్షణ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా దంపతులు, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు, రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జి రామ్మోహన్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, కార్మికుల కుటుంబ సభ్యులు, యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలస కుటుంబాల పిల్లలకు పోలియో చుక్కలు

పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

కోటపల్లి, మార్చి 4 : వెంచపల్లికి రెండు కిలోమీటర్ల దూరంలోని ప్రాణహిత తీరంలో గల వలస మత్స్యకార కుటుంబాల పిల్లలకు సోమవారం హెల్త్ అసిస్టెంట్ పబ్బ సుధాకర్ గౌడ్ పోలియో చుక్కలు వేశారు. కోటపల్లి పీహెచ్‌సీ నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి వెళ్లి కార్యక్రమం నిర్వహించారు. అలాగే వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లల కోసం తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు.

భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారిగా చంద్రకళ

నస్పూర్, మార్చి 4 : జిల్లా భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారిగా డీ చంద్రకళ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అధికారుల సమన్వయంతో కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గద్వాల్ జిల్లా గద్వాల్ ఆర్డీవోగా పనిచేసిన చంద్రకల ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు.

మహిళలకు ఆటల పోటీలు

పోటీల్లో తలపడుతున్న మహిళలు

సీసీసీ నస్పూర్, మార్చి 4 : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆధ్వర్యంలో నస్పూర్‌కాలనీ మనోరంజన్ సముదాయ్‌లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం డీవైపీఎం దేవేందర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు బాంబ్‌బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ తోట సురేశ్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, సభ్యులు శారద, మంగ, సునీత, రజిత, భవాని, మమత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి

మందమర్రి రూరల్, మార్చి 4 : సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎండ తీవ్రత తట్టుకునేలా సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశాడు. కేకే ఓసీని సోమవారం సందర్శించి, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఓసీ క్వారీలో అదనపు షెల్టర్లు ఏర్పాటు చేయాలని, రుమాళ్లు, మజ్జిగ సరఫరా చేయాలని, చల్లటి తాగునీటి కుండలు ఏర్పాటు చేయాలని, పనిముట్లు భద్రపర్చుకునేందుకు బాక్సులు, అలాగే క్యాంటీన్‌లో మధ్యాహ్నం రైస్ సౌకర్యం, మహిళా ఉద్యోగులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు మర్రి కుమారస్వామి, రాజేశ్ యాదవ్, గుమసా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దండేపల్లి, మార్చి 4 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు, డీఏ విడుదల, పెండింగ్ బిల్లులు తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సూరినేని గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ రవికాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్ష్ రాజేశ్వర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్మోహన్‌రావు, శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలిస్తాం
- కలెక్టర్ బదావత్ సంతోష్
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ

నస్పూర్ : అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 4 : ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా చెన్నూర్, మాదారం, క్యాతనపల్లి, నస్పూర్, చంద్రవెల్లి, కోటపల్లి, భీమారం, జెండా వెంకటాపూర్, దుగ్నేపల్లి, కన్నెపల్లి, మంచిర్యాల, హాజీపూర్, ముల్కల, పెర్కపల్లి, చిత్తాపూర్, నెన్నెల, కాసిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, తమ సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో 71 దరఖాస్తులు అందాయన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి, పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆయా మండలాల్లో..

బెల్లంపల్లి/వేమనపల్లి/తాండూర్/భీమారం/కోటపల్లి, మార్చి 4 : జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రజావాణి నిర్వహించారు. బెల్లంపల్లిలో తహసీల్దార్ ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక్కడ 6 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించినట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు. ధరణి పోర్టల్‌లో 93 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి వరకు 25 పరిష్కరించినట్లు చెప్పారు. 9వ తేదీలోగా అన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడ ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సువర్ణ, ఏపీవో సత్య ప్రసాద్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. భీమారం ఎంపీడీవో కార్యాలయంలో 2 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాధ రాథోడ్ తెలిపారు. కాగా, ఇక్కడ అన్ని శాఖల అధికారులు హాజరుకాలేదు. ఒకరిద్దరు మాత్రమే రాగా, దీనిపై వివరణ కోరేందుకు ఎంపీడీవోను 'నమస్తే' ఫోన్‌లో సంప్రదించగా, స్విచ్ ఆఫ్ అని వచ్చింది. కాసిపేటలో నిర్వహించిన ప్రజావాణిలో కోమటి చేను శివారులోని సల్వాలవాగు ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మించాలని కోమటి చేను రైతులు తహసీల్దార్ భోజన్నకు దరఖాస్తు చేసుకున్నారు. 2005లో సవ్వాలవాగు చెరువు పూర్తి చేశారని, చెరువు కింద 3200 ఎకరాల సాగు భూమి ఉందని, ఎడుమ కాలువ నిర్మాణం చేపట్టపోవడంతో గుంట భూమికీ సాగు నీరు అందడం లేదని తెలిపారు. కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో ఆకుల భూమన్న అర్జీలు స్వీకరించారు. ఎంపీవో అక్తర్ మోహినొద్దీన్, ఏవో మహేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాథ్ స్వామి, పశువైద్యాధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి @ ముచ్చట్లు.. కునుకులు..

కునుకు తీస్తున్న ఓ అధికారి

ప్రజలు సమస్యలు విన్నవించుకుంటే అక్కడికక్కడే సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడించి పరిష్కరించేందుకు అందరు అధికారుల సమక్షంలో కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. కానీ.. అది అధికారులు పడుకునేందుకు.., ముచ్చట్లు పెట్టుకునేందుకు అడ్డాగా మారిందని చెప్పేందుకు 'నమస్తే' తీసిన ఈ ఫొటోలే నిదర్శనం. కలెక్టర్, అదనపు కలెక్టర్లు పలుమార్లు హెచ్చరించినా వారి తీరు మారడం లేదు. కొందరు ప్రజావాణికి డుమ్మా కొడుతుంటే మరికొందరు వచ్చి ఇలా కాలయాపన చేస్తున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మార్చి 4

సెల్‌ఫోన్‌లో కొందరు, ముచ్చట్లలో మరికొందరు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సీసీసీ నస్పూర్, మార్చి 4 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సీసీసీ నస్పూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. కియో జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మందమర్రిలో ఇటీవల 7వ జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సింగిల్ కటాస్, టీం కటాస్ విభాగంలో సీసీసీ నస్పూర్‌కు చెందిన బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు నిహాల్, రమాకాంత్, అశ్రిత్, శ్రీహరిణి, అవని, శివకుమార్, ఉత్తమనంద(ప్రథమ), సాన్విశ్రీ, జేబీ అర్హాన్, అనురాగ్, స్నేక్షక, నందన, రాకేశ్(ద్వితీయ) విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, ఇన్‌చార్జి సారిక, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లు రజిత, కరాటే మాస్టర్ రంగ రమేశ్ అభినందించారు.

రాష్ట్రస్థాయిలో..

మంచిర్యాల అర్బన్/రామకృష్ణాపూర్, మార్చి 4 : హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్ర స్థాయి కరాటే 'డు' పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారని జిల్లా అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి శివమహేశ్, కోచ్ రాజేశ్వర్ తెలిపారు. కుమిటే(ఫైట్) విభాగంలో హర్షిత (ప్రథమ).., జ్ఞానవి, నికిత, మాధురి (ద్వితీయ).., మన్విత, లక్ష్మీరాజ్, ఇషితా, తస్విక, సహస్ర, దుర్గేశ్వరి (తృతీయ).., కటాస్ విభాగంలో తస్విక (తృతీయ) విజయం సాధించారని పేర్కొన్నారు. కోచ్‌గా రాజేశ్వర్, జూల శ్రీనివాస్, మేనేజర్‌గా వెంకటేష్ ప్రసాద్ వ్యవరించారు. వీరిని తెలంగాణ స్పోర్ట్స్ కరాటే 'డు' అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, కోశాధికారి రామస్వామి, జిల్లా అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి శివమహేశ్, జిల్లా సంఘం సభ్యులు అభినందించారు.

కోటపల్లి, మార్చి 4 : మందమర్రిలో ఆదివారం జరిగిన కాకా కుంగ్‌ఫూ అండ్ కరాటే ఛాంపియన్ షిప్‌లో మండలంలోని ఉషోదయ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మాస్టర్ పట్టం తిరుపతి తెలిపారు. బాలుర కటాస్ విభాగంలో కే రేయన్స్, కే రిశ్వంత్ వెండి పతకాలు, డీ–గ్రూపులో పీ చందన్ కాంస్య పతకం సాధించారు. బాలికల విభాగంలో పీ అంజలి బంగారు, కే వర్షిత వెండి, బీ రిత్విక కాంస్య పతకం సాధించారు.

సీసీసీ నస్పూర్ :జాతీయస్థాయిలో బహుమతులు అందుకున్న బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు

మంచిర్యాల అర్బన్/రామకృష్ణాపూర్ : రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు

134 ప్రజాపాలన దరఖాస్తులు

మంచిర్యాలటౌన్, మార్చి 4 : మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. రెండు కౌంటర్ల ద్వారా దరఖాస్తులను తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. కాగా, సోమవారం 134 దరఖాస్తులు అందినట్లు చెప్పారు.

మంచిర్యాల టౌన్ : దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు

వేమనపల్లిలో..

వేమనపల్లి, మార్చి 4 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీవో బాపురావు ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీల్వాయి గ్రామానికి చెందిన నికాడి జంగుమేర కరెంటుకు సంబంధించిన జీరో బిల్లు రాలేదని దరఖాస్తు సమర్పించారు. ఏపీఎం ఉమారాణి, సూపర్‌వైజర్ సువర్ణ, లక్ష్మీనారాయణ, ఏపీవో సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నస్పూర్ మున్సిపాలిటీలో..

సీసీసీ నస్పూర్, మార్చి 4 : నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చైర్మన్ సుర్మిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 4 : తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న మున్నూరుకాపుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరికం రాజారాం, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలంటే ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ చింత పండు మహేందర్, యూత్ జిల్లా అధ్యక్షుడు సీపతి సురేశ్, నాయకులు గొంగల్ల శంకర్, సతీశ్, తిరుపతి, ఆరె శ్రీనివాస్, ఆకుల బాల కృష్ణ, బీ రవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

కాసిపేట, మార్చి 4 : కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఎస్‌ఐ ఏ గంగారాంతో కలిసి మందమర్రి సీఐ కే శశిధర్ సోమవారం పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రత విషయాలు, ఇబ్బందులేమైనా ఉన్నాయనే విషయాలపై పరీక్షా కేంద్రం అధికారులతో పాటు పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ శశిధర్, ఎస్‌ఐ గంగారాం

పాఠశాలల్లో మాక్ పోలింగ్

భీమారం, మార్చి 4 : భీమారం జడ్పీ పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ సదానందం ముఖ్య అతిథిగా హాజరై, ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారు. ఆర్వో, ఎస్వో, పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డీ విక్రమ్ కుమార్, ఉపాధ్యాయులు రవీందర్, సునీత పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు విక్రమ్

కాసిపేట జడ్పీ పాఠశాలలో..

కాసిపేట, మార్చి 4 : కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. హెచ్‌ఎం మామిడిపల్లి సాంబమూర్తి సూచనలతో ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీ సుధారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా సాధారణ ఎన్నికల పద్ధతిలో నిర్వహించిన ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొని, తమ లీటర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, రవి కుమార్, వేణు, సికిందర్, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మిస్టర్ బెల్లంపల్లిగా లక్ష్మణ్

బహుమతి అందుకుంటున్న మిస్టర్ బెల్లంపల్లి గుండం లక్ష్మణ్

బెల్లంపల్లి, మార్చి 4 : మిస్టర్ బెల్లంపల్లిగా గుండం లక్ష్మణ్, మిస్టర్ ఐరన్‌మ్యాన్ (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా)గా మంచిర్యాలకు చెందిన ఎండీ అన్వర్ గెలుపొందారు. బెల్లంపల్లి స్కై జిమ్ నిర్వాహకుడు పన్నాల సదానందం సహకారంతో తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని ఏఎంసీ గ్రౌండ్‌లో మిస్టర్ బెల్లంపల్లి–2024, మిస్టర్ ఐరన్ మ్యాన్–2024 పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్‌ఐ నరేశ్, కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మిస్టర్ ఇండియా పీ రాజు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీ రాకేశ్, మిస్టర్ కోల్ ఇండియా బాడీ బిల్డర్లు జెట్టి నాగమల్లేశ్వర్‌రావు, ఓరం సురేశ్, సీనియర్ బాడీ బిల్డర్లు కేఎస్ రాజు, మారయ్య, బత్తుల వెంకటస్వామి, కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న మిస్టర్ ఐరన్‌మ్యాన్ అన్వర్

బాధిత కుటుంబానికి పరామర్శ

చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

జన్నారం, మార్చి 4 : మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జంగ సంతోష్ తండ్రి జంగ చంద్రమౌళి ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, మండల నాయకులతో కలసి పరామర్శించారు. సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారివినయ్, కో–ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్ పాల్గొన్నారు.

తునికాకు యూనిట్ల అమ్మకాలు చేపట్టాలి

మంచిర్యాలటౌన్, మార్చి 4 : తునికాకు యూనిట్ల అమ్మకాలను ప్రభుత్వం త్వరితగతిన చేపట్టాలని బీడీ లీవ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుస్కూరు వరప్రసాదరావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు తమ అసోసియేషన్ తరపున వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో 194 తునికాకు యూనిట్లు ఉండగా, 26 యూనిట్ల ఆకు మాత్రమే అమ్మకాలు చేశారన్నారు. మార్చి 15 తర్వాత యూనిట్ల అమ్మకాలు జరుగవు కాబట్టి ఈ లోపే చేపట్టాలని కోరారు. దీని వల్ల ప్రభుత్వంపై ఎలాంటి భారమూ పడదని, మొత్తం సొమ్ము తునికాకు కాంట్రాక్టర్ దగ్గరనే వసూలు చేసి కార్మికులకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

బెల్లంపల్లి రూరల్, మార్చి 4 : బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు 14వ విడుత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. ఉపాధి సిబ్బంది పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలతో సకాలంలో హాజరవ్వాలని సూచించారు.

బుగ్గ దేవాలయంలో అన్నదానం

బెల్లంపల్లి రూరల్, మార్చి 4 : కన్నాల శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు, సభ్యుల సమక్షంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో బాపిరెడ్డి, క్లర్క్ భాను, దేవాలయ కమిటీ సభ్యులు బావండ్లపల్లి గోపి, జిల్లపల్లి వెంకటస్వామి, అభినవ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బెల్లంపల్లి, మార్చి 4 : వన్యప్రాణి సంరక్షణపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వరల్డ్ వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జువాలజీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఐక్యూఏసీ విభాగం సహకారంతో తెలుగు, ఇంగ్లిష్ బాషల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లత, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, లెక్చరర్లు టీ రేణుబాబు గౌడ్, కంబాల మురళీకృష్ణ, పీ అరుణ, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండయ్య సేవలు మరువలేనివి

శ్రీరాంపూర్, మార్చి 4 : శ్రీరాంపూర్ ఏరియా ప్రజలు సీపీఐ మాజీ ఉప సర్పంచ్ తాళ్లపల్లి కొండయ్య సేవలు, పోరాటాలు మరువలేరని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే శంకర్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ కాలనీలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కొండయ్య స్మారక స్థూపానికి, చిత్రపటానికి జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మణ్‌తో కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కొండయ్య బిడ్డలు సుస్మాస్వరాజ్, సుప్రియ దంపతులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు కారుకూరి నగేశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హాజీపూర్, మార్చి 4 : మండలంలోని రాపల్లి పునరావాస కాలనీలోని అనె సత్తయ్య ఇంట్లో నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు వారు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం హాజీపూర్ ఎస్‌ఐ సురేశ్‌కు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు రాజు, తిరుపతి పాల్గొన్నారు. ఈ మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైన్ షాప్‌లో దొంగతనం

శ్రీరాంపూర్, మార్చి 4 : శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద గల హరిహర వైన్‌షాప్‌లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి వైన్‌షాప్ పైన రేకులు పగలగొట్టి షాపులోకి దూరాడు. మద్యం బాటిళ్లు, కౌంటర్‌లోని రూ.30 వేల నగదు దోచుకెళ్లాడు. దొంగతనం జరిగిన తీరు, వ్యక్తి సీసీసీ కెమరాలో రికార్డు అయిందని, ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం, పోలీసులు వైన్‌షాప్‌లో ధర్యాప్తు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

పీవోలకు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 4 : శ్రీరాంపూర్ ఓసీపీ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న పురుషోత్తంరెడ్డి, నూతన పీవోగా వచ్చిన శ్రీనివాస్‌ను సోమవారం నాయకులు, కార్మికులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అధికారుల సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పిట్ కార్యదర్శి లచ్చన్న, ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కులవార్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

కాసిపేట, మార్చి 4 : కాసిపేట ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న సత్యనారాయణ సింగ్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, ఏఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయిసీడం రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మడావి అనంతరావు, కనక గోవర్ధన్, మంగ శ్రీకాంత్, కొడప భీంరావ్ పాల్గొన్నారు.